తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పంటపొలాలపై ఒంటరి ఏనుగు హల్‌చల్



రామకుప్పం, జూన్ 26 ప్రభాతవార్త మండలంలోని అటవీ సరిహద్దు గ్రామమైన ననియాల పరిసరాల్లో ఒంటరి ఏనుగు పంటలపై దాడులు చేస్తూ హల్‌చల్ చేస్తోంది. మామిడి, వరి పంటలను ధ్వంసం చేస్తోంది. బెంగళూరప్ప, శంకరప్ప, నాగరాజులకు చెందిన వరి. మామిడి పంటలను తిన్నంత తిని నాశనం చేసిందని రైతులు వాపోయారు. బుధవారం రాత్రి ననియాల గ్రామం వద్ద చంద్రమోహన్ అనే రైతుకు చెందిన పశువుల షెడ్‌ను కొంతమేర ధ్వంసం చేసింది. అదే సమయంలో చంద్రమోహన్ భార్య బయటకు రాగా ఏనుగు ఆమెను వెంబడించడంతో ఆమె అరుపులు వేస్తూ గ్రామంలోకి పరుగులు తీసింది. ఏనుగు అరుపులకు ఆందోళన చెందిన చంద్రమోహన్ షెడ్‌లోనే బిక్కుబిక్కుమంటూ కొంతసమయం గడిపి ఒంటరి ఏనుగు అక్కడి నుంచి వెళ్లాక గ్రామానికి చేరాడు. అటవీ అధికారులు స్పందించి ఒంటరి ఏనుగు దారి మళ్లించాలని రైతులు కోరుతున్నారు.

## ధర్మరాజుల స్వామి ఆలయం దేదీప్యమానం





శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త శ్రీ కాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి ఆలయ ఇఒ డి బాపిరెడ్డి పర్యవేక్షించారు. ఏర్పాట్లను ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మురళీధర్‌రెడ్డి వివరించారు. గురువారం రాత్రి ఆలయం వద్ద విద్యుత్‌దీపాల అలంకరణతో ఆలయం దేదీప్యమానంగా మారింది. లేజర్ లైటింగ్ ఏర్పాటుతో రంగు రంగుల ప్రపంచంగా మారింది. చూపరులను ఇట్టే ఆకట్టుకునే విధంగా తీర్చి దిద్దారు. శుక్రవారం ధ్వజారోహణకు సిద్ధం చేస్తున్నారు. పది రోజుల పాటు ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసారు.

# డ్రగ్స్ రహిత జిల్లా ఆవిష్కరణకు కంకణం

### - కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు




మాదకద్రవ్యాల కట్టడికి కలెక్టర్ ఆధ్వర్యంలో చిత్తూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీ.

చిత్తూరు, జూన్ 26 ప్రభాతవార్త: డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకుని పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో గురువారా మాదక ద్రవ్యాల నివారణపై నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ సుమిత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించగా ఈ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా జడ్జి భారతిలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం సర్కిల్, దర్గా సర్కిల్, చర్చివీధి నుండి తిరిగి గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారిని మొక్కగా వున్నపుడే తుంచేసే ఉద్దేశంతో విద్యార్థిని విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించి వారు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ బారిన పడి చాలా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, వేల మంది జీవితాలు నాశనం అవుతున్నాయని, ఆర్థికంగా వెనుకబడటం జరుగుతన్నదన్నారు. కొంతమంది విద్యార్థిని, విద్యార్థులు తెలిసి, తెలియని వయస్సులో డ్రగ్స్ బారిన పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల సమాజానికి, మనకు, మన భవిష్యత్తు తరాల వారికి, విద్యార్థులకు ఎంత ప్రమాదకరమనే విషయం తెలియజేయడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మాదకద్రవ్యాలు మనకు కనబడకుండా మన చుట్టూ చేరి మన కుటుంబాన్ని, మన భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక లీగల్ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాఆ తీర్చిదిద్దడానికి కృషి చేయడంలో భాగంగా ప్రతి కళాశాల యాజమాన్యం వారి కళాశాలల్లో మాదకద్రవ్యాల వాడకంపై జిల్లాలోని వివిధ శాఖలు, విద్యాసంస్థలు మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగిందన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ సమజంలో విద్యార్థిని విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, రవాణా చేయడంపై గత సంవత్సరం చిత్తూరు జిల్లాలోనే మొత్తంగా 240కి పైగా కేసులు పెటిన 1,440 కేజీల మాదక ద్రవ్యాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే 740 మందిని అరెస్టు చేశామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థిని, విద్యార్థులు, యువతకు తెలిసో తెలియక కొంతమంది మాదకద్రవ్యాలకు బానిసగా మారుతున్నారన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, అమ్మినా, నిల్వ వుంచినా, రవాణా చేసినా నేరంగా పరిగణించబడుతుందని దీనికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించే అవకాశం వుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి భారతి, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్పీ నందకిషోర్, కూటమి పార్టీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, ఎక్సైజ్ ఎఎస్‌పి శ్రీనివాస్, జడ్పీ సిఇఒ రవికుమార్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి




గూడూరు, జూన్ 26, ప్రభాతవార్త యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఏఈఎస్ ఉషశ్రీ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధిత పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలను సేవించడం వలన అనార్యోగాలకులోనై జీవితం అంధకారమయంగా మారుతుందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు నిర్వీర్యంగా మారుతుందన్నారు. యువత చేతుల్లోనే దేశభవిష్యత్తు ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి అలవాట్లును అలవర కోవాలన్నారు. సమాజంలో మాదకద్రవ్యాలను నియంత్రంచడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజానికి కృషిచేయాలన్నారు. ముందుగా గూడూరు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా సమావేశం నిర్వహించి అనంతరం పలు కాలేజీ విద్యార్థులు అన్ని శాఖల అధికారులు గూడూరు పట్టణంలో ర్యాలీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు కిషోర్ బాబు, శేఖర్ బాబు, శ్రీనివాస్, బాలకృష్ణ, కరీమా బేగం, సూర్యనారయణ, సురేంద్రబాబు, ఎస్ఐలు శేషమ్మ, రఫీ, మనోజ్ కుమార్ తిరుపతయ్య, గోపాల్, సురేష్ బాబు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత ఇంట్లో కోటి రూపాయలు చోరీ



ఆరె గ్రామంలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

కేవీబీ పురం, జూన్ 26 ప్రభాతవార్త: టీడీపీ నేత ఇంట్లో కోటి రూపాయలు బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో కోటి రూపాయలు సొత్తు చోరీ జరిగిన సంఘటన కేవీబీ పురం మండలంలోని ఆరె గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని ఆరె గ్రామానికి చెందిన టీడీపీ నేత గార్లపాటి ప్రకాష్‌రావు (జి.ప్రకాష్‌నాయుడు) వ్యాపారవేత్త ఇంట్లో బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కోటి రూపాయల సొత్తు చోరీ జరిగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసుల కథనం మేరకు... గార్లపాటి ప్రకాష్‌రావు, భార్య శ్రీదేవి బుధవారం ఉదయం షిరిడి వెళ్లారు. పసిగట్టిన దొంగలు బుధవారం అర్ధరాత్రి తలుపులు పగులగొట్టి బీరువా లాకర్‌లో ఉన్న 120 సవర్లు గోల్డ్(ఒక కిలోపైబడి) వెండీ ఐదు కేజీలు, 10 లక్షలు డబ్బు మొత్తం దోచుకెళ్లారు. గురువారం ఉదయం ప్రకాష్‌రావు అన్న యుగంధర్ నాయుడు వచ్చి ఇంట్లో చూడగా చోరీ జరిగినట్లు ఆయన గుర్తించి కేవీబీపురం పోలీసులకు సమాచారం అందించారు. నారాయణవనం సీఐ రవీంద్ర, కేవీబీ పురం మండల ఎస్ఐ నరేష్ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిత్తూరు హెడ్ క్వార్టర్ నుంచి క్లూస్‌టీం రంగప్రవేశం చేసి క్షుణ్ణంగా పరిశీలించారు. అన్న యుగంధర్ సమాచారంతో ప్రకాష్‌రావు షిరిడీ పర్యటనను రద్దు చేసుకుని తిరుగు ప్రయాణమైనట్లు తెలిపారు.

### రైతులను బురిడి కొట్టిస్తున్న

# కూల్ బీచ్ మామిడి పరిశ్రమ!

### దొడ్డిదారిలో రాత్రి పూట కాయలు కొనుగోలు

### ఆందోళన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు




పూతలపట్టు, జూన్ 26, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం తోటాపురి మామిడి కాయలకు గిట్టుబాటు ధర కల్పించడంతో కూల్ బీచ్ మామిడి గుజ్జు తయారీ పరిశ్రమ మామిడి రైతులను బురిడి కొట్టిస్తున్నారు. ఆ సంస్థ ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు మామిడి కాయలు కొనుగోలు చేయడం లేదని గమనిక బోర్డు పెడుతున్నారు. అయితే దళారులతో దోస్తీ కట్టి రాత్రికి రాత్రే దొడ్డిదారిలో మామిడి కాయలు కోనుగోలు చేస్తున్నారని మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేసారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పూతలపట్టు మండలం పి. కొత్తకోట కూల్ బీచ్ మామిడి పరిశ్రమ నందు అవినీతి బయటపడింది. ఆ కంపెనీ యాజమాన్యం స్థానిక రైతుల నుంచి మామిడి కాయలును కొనుగోలు చేయకుండా బయటి మామిడి పరిశ్రమ వాళ్లతో కలిసి సిండికేట్ రాజకీయాలను ప్రదర్శిస్తూ మామిడికాయల తూకలలో అవతవకలు చోటు చేసుకున్నది. స్థానిక రైతులకు తీసుకుని వచ్చే మామిడికాయల బరువులలో 1000 కేజీలకు 100 కేజీలు తక్కువ చూపెట్టడం అసలే గిట్టుబాటు ధర లేక రైతన్నల గోడు వర్ణాతీతముగా ఉన్నది దీనికి తోడు ఈ ప్రైవేటు యాజమాన్యాలు సిండికేట్గా ఏర్పడి కూల్ బీచ్ కంపెనీలో రైతులను నిట్టనిలువుగా ముంచేసే ప్రయత్నాలు చేయడం చాలా దరుణమని ఆ కంపెనీ నుంచి బయటకు వెళ్లే మామిడికాయలను పక్కనే ఉన్న తేజస్ డైరీ వేయింగ్ బ్రిడ్జిపై తూకలు వేయడం తమకు వచ్చే మామిడికాయలను తమ కంపెనీ వేయింగ్ బ్రిడ్జి పై తూనికలు వేయడంతో ఈ అవినీతి రహస్యం బయటకు వచ్చినదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం వారు పట్టించుకోని ఇలాంటి అవకతవకలు జరగకుండా రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఉందని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ఇలా రైతులను మోసం చేసే కంపెనీలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రూ.కోటి మోసం కేసును ఛేదించిన పోలీసులు

సూళ్లూరుపేట, జూన్ 26 ప్రభాతవార్త





విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కోటి రూపాయలు నగదు ఇస్తే రెండున్నర కోట్లు చలామణిలో లేని 500, 2వేల రూపాయల కరెన్సీ నోట్లను ఇస్తామని మోసం చేసి ఒక వ్యక్తి వద్ద నుంచి కోటి రూపాయలు కాజేసిన ముఠాను సూళ్లూరుపేట పోలీసులు చాకచక్యంగా ఛేదించి, వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుపతిలో విలేఖరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చిన్నస్వామి అనే గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ ద్వారా కొంతమంది మధ్యవర్తులతో మాట్లాడి కమిషన్ ఇస్తానని సూళ్లూరుపేటకు చెందిన జగదీష్ అనే వ్యక్తిని బాగా నమ్మించాడు. మా వ్యాపారం లీగల్ అని చెప్పి మధ్యవర్తుల ప్రమేయంతో అతన్ని బాగా ప్రేరేపించారు. పక్కా ప్లాన్ ద్వారా జగదీష్ దగ్గరకు వచ్చి అతన్ని మేము అడిగిన డబ్బు అందజేస్తే రెండున్నర రెట్ల డబ్బులు ఎక్కువగా అందజేస్తామంటూ బాగా నమ్మబలికారు. మే 7వ తేదీ ఉదయం 7 గంటల సమయంలో రెండు ఇన్నోవా కార్లలో వచ్చిన అగంతకులు జగదీష్, అతని స్నేహితుల వద్ద నుంచి కోటి రూపాయల నగదును దగ్గరలో ఉన్న ఒక గది దగ్గరకు వెళితే తమ బాస్ పింక్ రెండువేల రూపాయల నోట్లు రెండున్నర కోట్ల రూపాయలు ఇస్తారని నమ్మించారు. దీంతో జగదీష్, అతనితో ఉన్న ఇద్దరు స్నేహితులు కోటి రూపాయలు వీరికి అందజేసేందుకు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, చిన్న అనుమానాలు నివృత్తి చేసుకునే దిశగా ప్రశ్నలు వేయడంతో అగంతకులు కోటి రూపాయల బ్యాగును తీసుకుని అక్కడి నుంచి తాము తీసుకొచ్చిన ఇన్నోవా కారులో పరారీ అయ్యారు. ఈ విషయమై జగదీష్ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ అగంతకుల పూర్తి వివరాలు తెలియనప్పటికీ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, అజయ్‌బాబు, కొండప్పనాయుడు, ఎఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు చిరంజీవి, సురేష్, మహేష్‌బాబులు ఈ కేసు విషయంలో లోతుగా దర్యాప్తు చేశారు. సాంకేతిక సమాచారం ఆధారంగా చాకచక్యంగా నలుగురు నిందితులను ఈ నెల 25వ తేదీన బూదనం టోల్‌ప్లాజా వద్ద, మరొకరిని తిరుపతిలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వివరించారు. వీరి వద్ద నుంచి 73 లక్షల 20 వేల రూపాయలు నగదు, రెండు ఇన్నోవా కార్లు, 2 వేల రూపాయల డమ్మీనోట్ల కట్టలు ఆరు, వైఫై మొబైల్ రూటర్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరిచినట్లు వెల్లడించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించడంలో ప్రతిభ చూపిన తమ సిబ్బందిని అభినందిస్తూ వారికి ఎస్పీ అవార్డులను ప్రకటించారు.

## కను మరుగవుతున్న పులికాట్ సరస్సు



వాకాడు, జూన్ 26, ప్రభాతవార్త ఆక్వా హేసరిలు నుండి పొల్యూషన్ వ్యర్థ పదార్థాలు పులికాట్ సరస్సులోకి రావడంతో మత్స్య సంపద కోల్పోతూ, మానవ జీవనోపాధి పరిణామాలు కూడా దెబ్బతింటున్నాయని ఆ ప్రాంత వాసులు బాధ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తీరా ప్రాంత గ్రామాలలో ఉన్న పులికాట్ సరస్సు ఆహ్లాదకరంగా ఎంతో సుందర వందనంగా ఉన్న సరస్సులో దేశ, విదేశాల నుండి అనేక జాతుల పక్షులు ఎంతో అందంగా సరస్సులో కనిపించేది, అలాంటి పులికాట్ సరస్సు పరిధిలో ఉన్న హేచరీలు ఎలాంటి అనుమతులు లేకుండా హేసరి లు నిర్మాణం పెరిగిపోవడంతో పులికాట్ సరస్సు అక్రమనకు గురై కనుమొరుగై పోతుందని స్థానిక వాసులు బాధ వ్యక్తం చేశారు, పులికాట్ సరస్సులోకి హేచరీల నుండి వచ్చే పొల్యూషన్ వ్యర్థ పదార్థాల ద్వారా సరస్సులో అనేక జాతుల పక్షులు రాకుండా పోతున్నాయని పర్యాటకులు రాలేకపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తపరిచారు, హేసరిల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా డైరెక్ట్‌గా పెద్ద పైపుల ద్వారా పొల్యూషన్ వ్యర్థ పదార్థాలు బంగాళాఖాత సముద్రంలోకి వదలడంతో సముద్రపు మత్స్య సంపద కూడా కనుమరుగై పోతుందన్నారు, పులికాట్ భూభాగంలో ఉన్న అనేక హేసరిలు పెరిగిపోతూ పులికాట్ సరస్సు విస్తీర్ణం తగ్గిపోతుంది అని అదేవిధంగా ఆ ప్రాంతమంతా పర్యావరణం అంతరించిపోతుందని తీర ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పులికాట్ సరస్సులో నుండి అక్రమంగా ఎర్రలు హేచరి నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి, ఆహ్లాదకరంగా ఉన్న పులికాట్ సరస్సు తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, సంబంధించిన శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### మండల స్థాయి పీజీఆర్ఎస్‌కు

## నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలి

### రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 26 ప్రభాతవార్త ః



మండల స్థాయి పీజీఆర్ఎస్‌కు నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి పీజీఆర్ఎస్, 22ఏ, హౌసింగ్ ఫర్ ఆల్, జీవో నెంబరు 30, రీసర్వే తదితర రెవెన్యూ సంబంధిత అంశాలపై మండల, డివిజన్, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మండల స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు నోడల్ అధికారులను నియమించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అంతే కాకుండా పీజీఆర్ఎస్‌పై జిల్లా ప్రజలకు అవగాహన ఉండే విధంగా వారికి తగు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్‌కు వెంకటేశ్వర్ స్వామి విగ్రహ ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో నరసింహులు, తిరుపతి, శ్రీ కాళహస్తి, సూళ్ళూరుపేట ఆర్డీవోలు బి. రామమోహన్, ఎం. భానుప్రకాష్‌రెడ్డి, ఈ కిరణ్మయి, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన సెక్షన్ హెడ్డులు, డెప్యూటీ కలెక్టర్లు, సిబ్బంది, జిల్లా లోని తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చుక్కల నిడిగల్లులో వెలుస్తున్న అక్రమ లేఅవుట్లు

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎక్కడ ఖాళీ కనబడితే వేసేయ్ పాగా అన్నట్లు సాగింది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేసుకొని సొమ్ము చేసుకున్నారు. కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఓ వైపు అక్రమ లేఅవుట్లు మరో వైపు ఇసుక మట్టిని తొలుచేస్తున్నారనే విమర్శలు మిన్ను ముట్టుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు భూముల్లో అక్రమ లేఅవుట్ల భాగోతం రచ్చకెక్కింది. గత పాలనలో అధికార పార్టీ నాయకుల మద్దతుతో రెవెన్యూ అధికారులు కళ్ళు మూసుకున్నారన్న ఆరోపణలున్నాయి.**

### పట్టించుకోని అధికారులు



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొందరు నాయకులు అక్రమ సంపాదనలకు పాల్పడుతున్నారు. అయితే గత పాలనలో విచ్చల విడిగా ఫ్రీహోల్డ్ భూములుగా మారాయి. భూ కోనుగోళ్ళలో భారీ ఎత్తున అవకతవకలుజరిగాయని అలాగే రెవెన్యూ సిబ్బంది సహకారంతో భూముల విలువకు రెక్కలొచ్చి అదనపు సొమ్ములు నాయకుల జేబుల్లో చేరిందనే విమర్శలు నేటికి బాహాటంగా ఉన్నాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తి మండలంలోని జగనన్న కాలనీ ఏర్పాటుకు సేకరించిన భూముల్లో భారీ ఎత్తున రెవెన్యూ అధికారి సహకారంతో రేట్లు ఎకరా మూడు రేట్లు లెక్క కట్టి సొమ్ము చేసుకున్నారనే విమర్శలు బాహాటగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చుక్కల నిడిగల్లు భూముల వివాదం చోటు చేసుకకుంది. ఇది హాట్ టాపిక్‌గా మారింది. చుక్కల నిడిగల్లు గ్రామ పంచాయతీలోని సర్వే నెంబర్ 254/4ఏ, 254/4బి రెండెకరాల్లో పంచాయతీ, తుడా అనుమతి లేకుండా లే అవుట్లు వేసి ప్లాట్ల విక్రయాలు జరిపేందుకు కొందరు నాయకులు శ్రీకారం చుట్టారు. పార్టీలతో ప్రమేయం లేకుండా వ్యాపారాలు సాగించేందుకు సిద్ధమైనట్లు ప్రజలు గుస గుస లాడుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. దీని వల్ల పంచాయతీ ఆదాయాలు రూ.సుమారు 3లక్షల నష్టపోతున్నామని తెలిపారు. గతంలో వైసిపిలో చక్రం తిప్పి దందాలకు పాల్పడిన వారు ప్రస్తుతం కూడా తమ హావా తగ్గలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వ్యాపారాల్లో పార్టీలతో ప్రమేయం లేకుండా భాగాలు పంచుకుంటున్నట్లు గుప్పు మంటుంది. అయితే అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణానికి చట్టూ ఇలాంటి దందానే సాగుతున్నట్లు సమాచారం. ఎక్కడ మట్టి కనబడితే అక్కడ తవ్వే! సువర్ణముఖి నదిలో ఎక్కడ గుట్ట కనబడితే తరలించేయ్ అన్నట్లు మారింది. ఎవరు ఎవరితో వ్యాపారం చేస్తున్నారన్నది పక్కన పెడితే అపవాదు ఎదుర్కొనేది అధికార పార్టీయే అన్నది గమనించాల్సి ఉంది. దీనిని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో జనం ఎవరు ఎవరికి తీసిపోరనే విమర్శలను మూటకట్టుకోనున్నారు.

